6న మెగా జాబ్ మేళా

ప్రజాశక్తి - ఏలేశ్వరం

ఈనెల 6వ తేదీన స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో ఎంఎల్ఎ వరుపుల సత్యప్రభ ఆధ్వర్యంలో మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి అధికారి శ్రీనివాస్, నైపుణ్య అభివృద్ధి అధికారి ఎమ్ కొండలరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్ఎస్‌సి, ఇంటర్, డిగ్రీ, డిప్లమో పూర్తి చేసి 19 నుంచి 35 సంవత్సరాల నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అభ్యర్థులను ఇంటర్వ్యూలు నిర్వహించి ఆయా కంపెనీలు అదే రోజు నియామక పత్రాలు ఇవ్వడం జరుగుతుందన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు nupunyam.ap.gov.in వెబ్ సైట్‌లో నమోదు చేసుకుని ఇంటర్వ్యూకు ఆరో తేదీ ఉదయం 10 గంటలకు హాజరు కావాలన్నారు.

ప్లస్ టూ కాలేజీలపై నిర్లక్ష్యం

- అధ్యాపకుల కొరత, వేధిస్తున్న సమస్యలు
- నేటికీ విద్యార్థులకు అందని యూనిఫామ్
- పట్టించుకోని కూటమి ప్రభుత్వం

ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి

గత ప్రభుత్వం 2022-23 నుంచి ఉన్నత పాఠశాలల్లో ఇంటర్మీడియట్ ప్రారంభించారు. వీటికి 'హైస్కూల్ ప్లస్' (ప్లస్ టూ) అని పేరు పెట్టారు. కొత్త విద్యా విధానంలో భాగంగా 2022 విద్యాసంవత్సరం నుంచి ఈ విధానాన్ని అమలు చేస్తున్నారు. దీంతో గ్రామీణ ప్రాంతాలలోని బాలికలకు ఇంటర్ విద్య అందుబాటులోకి వచ్చింది. తొలుత అడ్మిషన్లు అంతంత మాత్రంగానే జరిగాయి. ఆ తర్వాత నుంచి క్రమంగా అడ్మిషన్లు పెరిగాయి. అయితే ప్రస్తుత ప్రభుత్వం ప్లస్ టూ కాలేజీలపై తీవ్ర నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తోంది. పలు కళాశాలల్లో అసౌకర్యాలు వేధిస్తుండగా అధ్యాపకుల కొరత సమస్య తీవ్రంగా ఉంది. ఈ ఏడాది యూనిఫామ్ ఒక్కరికి కూడా పంపిణీ చేయలేదు. ఈ కళాశాలల్లో చేరాలనుకుంటున్న విద్యార్థుల సంఖ్య నానాటికి తగ్గిపోతోంది. జిల్లాలో ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం కలిపి పెద్దాపురం మండలంలో 41 మంది, గొల్లప్రోలు మండలంలో 48, ఏలేశ్వరంలో 42, గండేపల్లిలో 75, యు. కొత్తపల్లి మండలంలో 110, జగ్గంపేటలో 28, సామర్లకోటలో 64, పిఠాపురంలో 77, కిర్లంపూడిలో 61, రౌతులపూడిలో 37, కాకినాడ రూరల్‌లో 126, కరపలో 50, పెదపూడిలో 48, ప్రత్తిపాడులో 18 మంది చదువుతున్నారు. మొత్తం 14 కళాశాలల్లో 825 మంది చదువుతున్నట్లు విద్యాశాఖ అధికారులు చెబుతున్నారు. అయితే ఇంటర్ మొదటి సంవత్సరంలో కొంతమంది చేరుతున్నప్పటికీ చాలామంది రెండవ సంవత్సరం వచ్చేసరికి ఇతర కళాశాలలకు మారుతున్నారు.

పిఠాపురంలో యూనిఫామ్ లేకుండానే హాజరవుతున్న విద్యార్థులు

అధ్యాపకుల కొరత

స్థానికంగానే ఇంటర్ వరకూ బాలికలకు విద్య అందుతుండడంతో తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. అయితే ఈ కళాశాలల్లో ప్రభుత్వం పూర్తిస్థాయిలో సౌకర్యాలు కల్పించడం లేదు. ప్రధానంగా అధ్యాపకులను నియమించలేదు. ఆయా హైస్కూళ్లలో తగిన ఉపాధ్యాయులనే బోధించాలని చెబుతోంది. వారు కూడా పూర్తిస్థాయిలో లేకపోవడంతో ఈ కళాశాలల్లో చేరేందుకు బాలికలు వెనకడుగు వేస్తున్నారు. ప్లస్ టూ కళాశాలల్లో బైపిసి, ఎంపిసి గ్రూపులను మాత్రమే నిర్వహిస్తున్నారు. ఒక్కో కళాశాలలో ఏడుగురు అధ్యాపకులు ఉండాలి. కానీ కూటమి సర్కారు అధ్యాపకుల పోస్టులను భర్తీ చేయడం లేదు. ఉదాహరణకు పిఠాపురం బిఎంఆర్ కళాశాలలో తెలుగు ఇంగ్లీషు, మాథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయోలజీ, జువాలజీ పోస్టులు మంజూరయ్యాయి. అయితే ప్రస్తుతం నలుగురు మాత్రమే పని చేస్తున్నారు. తెలుగు, ఇంగ్లీషు మీడియం అధ్యాపకులు పదవీ విరమణ చేశారు. జువాలజీ లెక్చరర్ బదిలీ అయి వెళ్లిపోయారు. నేటికీ వారి స్థానంలో పోస్టులు భర్తీ కాలేదు. దీంతో చేరే పిల్లల సంఖ్య తగ్గిపోతోంది. ఇలా పలు ప్లస్ టూ కళాశాలల్లో ముగ్గురు, నలుగురు అధ్యాపకుల కొరత వేధిస్తోంది.

తగ్గుతున్న విద్యార్థుల సంఖ్య

పిఠాపురం బిఎంఆర్ ప్రభుత్వ హైస్కూల్లో 'ప్లస్ టూ' (మహిళా జూనియర్ కళాశాల)ను రెండేళ్ల క్రితం ప్రారంభించారు. కార్పొరేట్ కళాశాలలకు ధీటుగా వీటిని అభివృద్ధి చేస్తామని ప్రభుత్వం పెద్ద ఎత్తున ప్రచారం చేసింది. కానీ సౌకర్యాలు కల్పించడం మరిచిపోయింది. ఈ కాలేజీలో గతేడాది మొదటి సంవత్సరం ఎంపిసిలో 15 మంది ఉండగా ఈ ఏడాది కేవలం ఐదుగురు మాత్రమే ఉన్నారు. అలాగే బైపిసిలో 35 మంది గతేడాది ఉండగా ఈ సంవత్సరం 8 మందికి తగ్గిపోయారు. కాకినాడ ఎపిఎస్‌పి కళాశాలలో విద్యార్థుల సంఖ్య బాగానే ఉన్నప్పటికీ అధ్యాపకుల కొరత వేధిస్తోంది. అలాగే ఈ ఏడాది ఏ ఒక్కరికి ప్రభుత్వం యూనిఫామ్ పంపిణీ చేయలేదు. పుస్తకాలు పూర్తిస్థాయిలో ఇవ్వలేదని ఆరోపణలు ఉన్నాయి. విద్యారంగాన్ని బలోపేతం చేస్తున్నామని గొప్పలు చెబుతున్న సర్కారు ఆచరణలో మౌలిక సదుపాయాలను కల్పించడంలో నిర్లక్ష్యం ప్రదర్శిస్తోందని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కావున ప్లస్ టు కళాశాలల్లో సౌకర్యాలు కల్పించి అధ్యాపకులను నియమించాలనే డిమాండ్లు వారి నుంచి వినిపిస్తున్నాయి.

అధ్యాపకులను నియమించాలి

గత ప్రభుత్వం మండలానికి ఒక్క జూనియర్ కళాశాల ఏర్పాటు చేస్తున్నామని ప్రచారం చేసుకుని ఎటువంటి సౌకర్యాలు కల్పించలేదు. కనీసం అధ్యాపకులు లేకుండానే గత 2 సంవత్సరాల నుంచి కళాశాలలు నడిపి పూర్తి స్థాయిలో విద్య అందకుండా విద్యార్థుల చదువులు భవిష్యత్తును గత ప్రభుత్వం గాలిలో ఉంచింది. కూటమి ప్రభుత్వం ఈ కళాశాలలను పట్టించుకోకపోవడం దారుణం. మూతపడిపోవడానికి సిద్ధంగా ఉన్న ఈ జూనియర్ కళాశాలలకు శాశ్వత భవనాలు ఏర్పాటు చేసి, అధ్యాపకులను నియమించాలి. ల్యాబ్, లైబ్రేరియన్, పీడీ పోస్టులు భర్తీ చేసి విద్యార్థులకు తక్షణమే న్యాయం చేయాలి.

-ఎంజి.సూరిబాబు, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి

పరిశ్రమల కేంద్ర భవనాన్ని పరిశీలించిన కలెక్టర్

ప్రజాశక్తి - కాకినాడ రూరల్

గత ఐదేళ్లుగా నిర్మాణ దశలో నిలిచిపోయిన జిల్లా పరిశ్రమల కేంద్ర భవనాన్ని కలెక్టర్ షాన్‌మోహన్ సగిలి శనివారం పరిశీలించారు. భవన నిర్మాణ పనులు ఎప్పుడు ప్రారంభం అయ్యాయి? ఎందుకు పనులు నిలిచిపోయాయి? అనే అంశాలపై ఆరా తీశారు. అనంతరం జిల్లా యువజన సర్వీసుల శాఖ సెట్రాజ్ కార్యాలయాన్ని, ఎపిఐఐసి జోనల్ మేనేజర్ కార్యాలయాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా పరిశ్రమల కేంద్రం భవనం వివిధ కారణాల చేత నిర్మాణం పనులు పూర్తి కాలేదన్నారు. ఈ భవనం పూర్తిస్థాయిలో అందుబాటులో తీసుకురావడానికి సుమారు రూ.2 కోట్లు విలువ చేసే పనులు చేయాల్సివుందన్నారు. ఇండస్ట్రియల్ ప్రాంతంలో ఇటువంటి భవనం అందుబాటులోకి వస్తే పారిశ్రామికంగా ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. దీనిపై అధికారులతో చర్చించి, త్వరలో నిర్ణయం తీసుకుంటామని అన్నారు. ఈ పర్యటనలో జిల్లా పరిశ్రమల శాఖ జిఎం సిహెచ్.గణపతి, ఎపిఐఐసి జోనల్ మేనేజర్ ఎ.రమణారెడ్డి, సెట్రాజ్ సిఇఒ కెఎస్‌వి.కాశీవిశ్వేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

భవనాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ షాన్‌మోహన్

జల వ్యవస్థల సంరక్షణ అవసరం

ప్రజాశక్తి - కాకినాడ

వివిధ శాఖలకు చెందిన వాటర్ బాడీస్, టాంక్ బెడ్లలో ఆక్రమణలను తొలగించి జల వ్యవస్థలను సంరక్షించేందుకు పటిష్టమైన చర్యలు తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లో చెరువులు, కాలువలు, డ్రయిన్లు, వాగులు తదితర వాటర్ బాడీస్ సంరక్షణకు ఏర్పాటైన జిల్లా స్థాయి కమిటీ సమావేశం జెసి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాగు, సాగునీటి అవసరాల కొరకు నిర్దేశించిన వాటర్ బాడీల ఆక్రమణలతో నీటి నిల్వ, నియంత్రణలు వ్యవస్థలు విచ్ఛిన్నమై నీటి కొరత, సహజ ప్రవాహాలకు అవరోధాలు ఏర్పడుతున్నాయని అన్నారు. తద్వారా ముంపు, మురుగు సమస్యలు ఎదురౌతున్నాయన్నారు. ఇటువంటి పరిస్థితుల నివారణకు సర్వోన్నత న్యాయస్థానం జారీ చేసిన ఆదేశాలను పటిష్టంగా అమలు చేయాలన్నారు. జిల్లాలో మొత్తం 21,185.95 ఎకరాల విస్తీర్ణంలో 2670 వాటర్ బాడీలు, టాంక్ బెడ్లను ఆర్‌డిఒలు గుర్తించారని, వీటిలో 327 వాటర్ బాడీలు, ట్యాంకులకు సంబంధించి 1,548 ఎకరాల విస్తీర్ణం ఆక్రమణకు గురైనట్లు ప్రాథమికంగా గుర్తించినట్లు తెలిపారు. ఇప్పటి వరకూ 2.49 ఎకరాల ఆక్రమణలను తొలగించామని, మిగిలిన ఆక్రమణలను సత్వరం తొలగించేందుకు డివిజన్, మండల రక్షణ కమిటీలు చర్యలను ముమ్మరం చేయాలని మీనా ఆదేశించారు. రానున్న నెల రోజుల్లో వాటర్ బాడీల పరిశీలన, సర్వేలు పూర్తి చేసి, వాటి విస్తీర్ణం, హద్దులను, ఏ శాఖకు చెందినవో వివరాలు ప్రకటిస్తూ అన్ని వాటర్ బాడీల వద్ద బోర్డులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అలాగే నిర్ధారణ అయిన ఆక్రమణలకు సంబంధించి కబ్జాదారులకు నోటీసులు జారీ చేసి, ఆక్రమణల తొలగింపునకు చట్టప్రకారం చర్యలు చేపట్టాలన్నారు. ఈ సమావేశంలో డిఆర్‌ఒ జె.వెంకట్రావు, డిపిఒ వి.రవికుమార్, ఆర్‌డిఒ కె.శ్రీరమణి, ఇరిగేషన్ ఇఇ శేషగిరిరావు, కాలుష్య నియంత్రణ మండలి, కుడా, డ్రెయినేజి, మున్సిపల్ ఇంజనీరింగ్, టౌన్ ప్లానింగ్ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న జెసి రాహుల్‌మీనా

సుఖీభవలో 'కౌలు రైతులకు అన్యాయం'

ప్రజాశక్తి - కాకినాడ

అట్టహాసంగా, పండుగ వాతావరణంలో శనివారం ప్రారంభించిన అన్నదాత సుఖీభవ పథకంలో కౌలు రైతులను చేర్చకపోవడం దారుణమని కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు ఎం.రాజశేఖర్ ఒక ప్రకటనలో అన్నారు. ఖరీఫ్ వ్యవసాయం ప్రారంభం అయి నెలన్నర అయిందని, నేటికి కౌలు రైతులకు సిసిఆర్‌సి కార్డులు ఇవ్వలేదని, సిసిఆర్‌సి కార్డులు ఇవ్వడానికి భూయజమాని సంతకం తప్పనిసరి చేయడంతో వారు ముందుకు రావడం లేదన్నారు. ఈ విషయంపై ప్రభుత్వం చట్టం మారుస్తామని ప్రకటించిందని, అయితే నేటికీ నిబంధన రూపొందించలేదని అన్నారు. సిసిఆర్‌సి కార్డు ఉండి, ఈ పోర్టల్‌లో నమోదు అయిన కౌలుదారులకే అన్నదాత సుఖీభవ వర్తిస్తుందని ప్రభుత్వం విడుదల చేసిన గైడ్లైన్స్‌లో ఉందన్నారు. దీనివల్ల కౌలు రైతులు తీవ్రంగా నష్ట పోనున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వ కౌలురైతులను గుర్తించడం లేదని, రాష్ట్ర ప్రభుత్వం సైతం అదే దోవలో నడుస్తుందని అన్నారు. జిల్లాలో లక్ష మంది పైన కౌలు రైతులు ఉన్నారని, నూటికి 80 శాతం కౌలు వ్యవసాయం జరుగుతుందని, ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం కౌలు రైతులను గుర్తించి, వారికి సిసిఆర్‌సి కార్డులు ఇవ్వాలని, లేదా గ్రూపులు ఏర్పాటు చేయాలన్నారు. ఈ క్రాప్ నమోదు చేయించాలని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం వస్తే కౌలు రైతులను ఆదుకుంటామని చెప్పిన మాటలు నిలబెట్టుకోవాలని రాజశేఖర్ కోరారు. లేకుంటే కౌలు రైతులతో ఉద్యమం తప్పని ఆయన హెచ్చరించారు.

కేంద్రం వద్ద ఆందోళన చేస్తున్న రైతులు

యూరియా కొరతపై రైతుల ఆందోళన

ప్రజాశక్తి - సామర్లకోట

యూరియా కొరతపై రైతులు ఆందోళనకు దిగారు. శనివారం మండలంలోని ఉండూరు రైతు సేవా కేంద్రం వద్ద సన్నకారు, కౌలు రైతులు ఎరువులు అందించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ రైతు సేవా కేంద్రానికి వచ్చే యూరియా ఎరువుల బస్తాలన్నీ అధికారులు రాజకీయ నాయకులకే ఇస్తున్నారని, కౌలు రైతులు, సన్నకారు రైతులకు ఒక్క బస్తా కూడా అందించడం లేదని వాపోయారు. రైతు సేవా కేంద్రానికి సంబంధం లేని వారికి రాజకీయ నాయకుల ప్రోత్సాహంతో లారీలు, ట్రాక్టర్లతో ఎరువులను తోలుతున్నారని విమర్శించారు. ప్రశ్నించే రైతులకు ఒకటి రెండు బ్యాగులను మాత్రమే అందించి చేతులు దులుపుకుంటున్నారని అన్నారు. అన్నదాత సుఖీభవ పథకం ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొనేందుకు వచ్చిన కలెక్టర్‌ను కలిసి తమ గోడును వెళ్లబోసుకునేందుకు అధికారులు అంగీకరించలేదని తెలిపారు. దీనిపై మండల వ్యవసాయ శాఖ ఎఒ వంగపండు మురళీధర్ మాట్లాడుతూ ప్రాంతాన్ని బట్టి, అక్కడున్న ఆయకట్టు విస్తీర్ణం బట్టి ఎరువుల నిల్వలు ఉంచుతామన్నారు. ఇప్పటికే వచ్చిన స్టాక్ అయిపోయినందున కొంత కొరత ఏర్పడిందని, ఎరువులు వస్తున్నా యని వాటిని అవసరమైన రైతులకు అందించేందుకు సిద్ధం చేస్తున్నట్టు ఆయన చెప్పారు.

జిల్లాలో రైతులకు రూ.101.93 కోట్ల లబ్ధి

జిల్లాలోని పలు ప్రాంతాల్లో అన్నదాత సుఖీభవ పథకం ప్రారంభోత్సవ కార్యక్రమాలు జరిగాయి. ఆయా కార్యక్రమాల్లో పలువురు ఎంఎల్‌ఎలు పాల్గొని రైతులకు మెగా చెక్కులను అందజేశారు.

ప్రజాశక్తి - యంత్రాంగం

సామర్లకోట జిల్లాలో 1,15,203 మంది రైతులకు అన్నదాత సుఖీభవ, పిఎం కిషాన్ పథకం ద్వారా రూ.101.93 కోట్ల మేర లబ్ధి జరిగిందని కలెక్టర్ షాన్‌మోహన్ సగిలి అన్నారు. శనివారం మండలంలోని ఉండూరు రైతు సేవా కేంద్రంలో అన్నదాత సుఖీభవ పథకం మొదటి విడత ప్రారంభోత్సవం కార్యక్రమంలో కలెక్టర్ రైతులతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం సూపర్ సిక్స్ హామీలలో భాగంగా 'అన్నదాత సుఖీభవ' పథకానికి సిఎం చంద్రబాబు ప్రకాశం జిల్లా దర్శిలో శ్రీకారం చుట్టారన్నారు. ఖరీఫ్ సీజన్ కీలక సమయంలో ఒకేసారి రూ.7 వేలు అందించడం ద్వారా, రైతులు విత్తనాలు, ఎరువుల కొనుగోలుకు అప్పులు చేయాల్సిన అవసరం లేదన్నారు. ఈ పథకంలో రాష్ట్ర ప్రభుత్వ వాటా రూ.5 వేలు, కేంద్ర ప్రభుత్వం రూ.2 వేలు కలిపి రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపిటిసి కొప్పిరెడ్డి రాజా, సొసైటీ అధ్యక్షులు బచ్చల జమీ, మాజీ అధ్యక్షులు బచ్చల రామారావు, మండల వ్యవసాయ అధికారి వంగపండు మురళీధర్, స్థానిక ప్రజాప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు. **జగ్గంపేట** స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద శనివారం అన్నదాత సుఖీభవ, పిఎం కిసాన్ పథకాన్ని ఎంఎల్‌ఎ జ్యోతుల నెహ్రూ ప్రారంభించారు. అలాగే ఎన్‌టిఆర్ భరోసా పింఛన్లను పంపిణీ చేశారు. ఎంపిడిఒ ఎవిఎస్.చంద్రశేఖర్ అధ్యక్షతన జరిగిన సభలో ఆయన మాట్లాడారు. గతంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులకు రూ.13 వేలు అందిస్తే కూటమి ప్రభుత్వం రూ.20 వేలు అందిస్తుందన్నారు. నియోజకవర్గంలోని నాలుగు మండలాలకు చెందిన 30,371 మంది రైతులకు రూ.20.71 కోట్లను వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేయడం జరిగిందన్నారు. అనంతరం సిఎం చంద్రబాబు చిత్రపటానికి రైతులు ధాన్యంతో అభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి అత్తులూరి నాగబాబు, రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ కొత్త వెంకటేశ్వరరావు, మార్కెట్ కమిటీ ఛైర్మన్ అడపా భరత్‌కుమార్, జగ్గంపేట విశాల పరపతి సంఘం ఛైర్మన్ బుర్రి సత్యనారాయణ, రాజపూడి సర్పంచ్ బుసాల విష్ణుమూర్తి, సొసైటీ అధ్యక్షులు కంటే వెంకటేశ్వరరావు, నియోజకవర్గ అభివృద్ధి కమిటీ సభ్యులు ఎస్‌విఎస్.అప్పలరాజు, మారిశెట్టి భద్రం, తహశీల్దార్ జెవిఆర్.రమేష్, ఇఒపిఆర్‌డి సత్యనారాయణమూర్తి, మండల వ్యవసాయాధికారి ఎస్. నరసింహం, ఎపిఒ రమణబాబు, టిడిపి నాయకులు, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. **తుని** స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో అన్నదాత సుఖీభవ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌ఎ యనమల దివ్య పాల్గొని మాట్లాడారు. తుని నియోజకవర్గంలో సుమారు 27 వేల మంది రైతులకు రూ.18.66 కోట్లను రైతుల ఖాతాలకు జమ చేసినట్లు తెలిపారు. ఖరీఫ్ వరి పంటను సాగు చేయడానికి అవసరమైన పెట్టుబడిగా ప్రభుత్వం ఈ నిధులను విడుదల చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా సిఎం సిఎం చంద్రబాబు, డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్ చిత్రపటాలకు రైతులు దాన్యాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు యనమల రాజేష్, మండల టిడిపి అధ్యక్షుడు చింతంనీడి అబ్బాయి, ఎంపిపి బొప్పన రాము, మునిసిపల్ ఛైర్‌పర్సన్ నార్ల భువన సుందరి, మునిసిపల్ మాజీ ఛైర్మన్ యినుగంటి సత్యనారాయణ, మోతుకూరి వెంకటేష్, కుసుమంచి శోభారాణి పాల్గొన్నారు. **పెద్దాపురం** స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో అన్నదాత సుఖీభవ పథకం ప్రారంభ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌ఎ నిమ్మకాయల చినరాజప్ప, డిసిసిబి ఛైర్మన్ తుమ్మల రామస్వామి పాల్గొని మాట్లాడారు. రైతులకు మెగా చెక్‌ను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతుల సంక్షేమం కోసం కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ డి.శ్రీలలిత, మున్సిపల్ మాజీ ఛైర్మన్ రాజా సూరిబాబురాజు, ఎడిఎ నల్లి దైవకుమార్, ఎఒకె సంజయ్‌కుమార్, సర్పంచులు మొయిళ్ళ కృష్ణమూర్తి, తోట రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు. **గండేపల్లి** స్థానిక వ్యవసాయ శాఖ కార్యాలయంలో అన్నదాత సుఖీభవ, పిఎం కిసాన్ పథకం ప్రారంభ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి రెడ్ల శ్రీరామ్ మాట్లాడారు. మండలంలో 7117 రైతుల కుటుంబాలకు రూ.4.98 కోట్లను రైతుల బ్యాంకు ఖాతాల్లో జమచేయడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు పోతుల మోహన్‌రావు, తహశీల్దార్ శ్రీనివాస్, ఎంపిడిఒ చంద్రరావు, టిడిపి గ్రామ పార్టీ అధ్యక్షులు బొల్లం రెడ్డి రామకృష్ణ, ఆళ్ల సత్తిబాబు, పైలి వెంకన్న పాల్గొన్నారు. **కరప** స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో అన్నదాత సుఖీభవ పథకం ప్రారంభోత్సవ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌ఎ పంతం నానాజీ, వ్యవసాయ శాఖ జెడి ఎన్.విజయ్‌కుమార్ పాల్గొన్నారు. రూరల్ నియోజకవర్గంలో రూ.6.87 కోట్లను రైతుల ఖాతాల్లో జమ చేసినట్లు ఎంఎల్‌ఎ పంతం నానాజీ తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి చిక్కాల రామచంద్రరావు, నాయకులు పెంకె శ్రీనివాస్‌బాబా, నులుకుర్తి వెంకటేశ్వరరావు, ఎంపిడిఒ ఎ.అనుపమ, ఎడిఎ బాబురావు, ఎఒ సత్య, తదితరులు పాల్గొన్నారు.

పెద్దాపురంలో రైతుకు మెగా చెక్‌ను అందిస్తున్న ఎంఎల్‌ఎ చినరాజప్ప

సామర్లకోటలో సుఖీభవ లైవ్ కార్యక్రమాన్ని తిలకిస్తున్న కలెక్టర్

ఆదిత్యలో పింగళి వెంకయ్య జయంతి

ప్రజాశక్తి - కాకినాడ

స్థానిక ఆదిత్య డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో పింగళి వెంకయ్య 149 వ జయంతిని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి కళాశాలల అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ బిఇవిఎల్.నాయుడు పూలమాలలు వేసి నివాళులర్పించారు. వ్యాసరచన పోటీల విజేతలకు క్యాంపస్ ఇన్‌ఛార్జ్ ఎన్.మూర్తి బహుమతులు అందించారు. ఈ కార్యక్రమాన్ని నిర్వహించిన ఎన్ఎస్ఎస్ బృందాన్ని ఆదిత్య విద్యాసంస్థల ఛైర్మన్ డాక్టర్ నల్లమిల్లి శేషారెడ్డి, డిగ్రీ కళాశాలల సెక్రెటరీ డాక్టర్ నల్లమిల్లి సుగుణారెడ్డి అభినందించారు.

పింగళి వెంకయ్యకు నివాళులర్పిస్తున్న ఆదిత్య విద్యార్థులు

10 నుంచి వాకర్స్‌కు అనుమతి

ప్రజాశక్తి - కాకినాడ

నగరంలోని ఆర్ఎంసి గ్రౌండ్‌లో ఈ నెల 10వ తేదీ నుంచి వాకింగ్ చేసుకునేందుకు వాకర్స్‌కు అనుమతి ఇస్తున్నట్లు రాజ్యసభ సభ్యులు సానా సతీష్‌బాబు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 11 నెలల క్రితం వాకర్స్‌కు అనుమతిని నిలుపుదల చేశారు. ఈ నేపథ్యంలో కలెక్టర్, కళాశాల ప్రిన్సిపల్‌తో మాట్లాడి సమస్యను పరిష్కరించినట్లు ఆయన తెలిపారు. ఈ నెల 10వ తేదీ నుంచి ఆర్ఎంసి మైదానంలో వాకర్స్‌కు వాకింగ్ చేసుకునేందుకు అనుమతి ఇవ్వడంతో పాటు, వాకర్స్‌కు ప్రత్యేకమైన ఐడిని జారీ చేయనున్నట్లు తెలిపారు.

నూతన రేషన్ షాప్ ప్రారంభం

ప్రజాశక్తి - కిర్లంపూడి

మండలంలోని శృంగరాయునిపాలెం గ్రామంలో శనివారం నూతన రేషన్ షాపును ప్రారంభించారు. డీలర్ పసల వెంకటలక్ష్మి ఆధ్వర్యంలో భూపాలపట్నం గ్రామ సర్పంచ్ వీరం రెడ్డికాశీబాబు దుకాణాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వెంకటేశ్వరరావు, కరణం భూరయ్య, కాసా సంతోష్, వీరవరం సొసైటీ డైరెక్టర్ నామసాని తాసు, గొడెబాల బాసు, గంధం సాయి. పెద్దిరెడ్డి శ్రీను పాల్గొన్నారు.

రైతుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

ప్రజాశక్తి - కాకినాడ రూరల్

రైతుల సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని మాజీ ఎంఎల్‌ఎ పిల్లి అనంతలక్ష్మి, నియోజకవర్గ టిడిపి కో-ఆర్డినేటర్ పిల్లి సత్యనారాయణమూర్తి శనివారం ఒక ప్రకటనలో అన్నారు. రైతుల సంక్షేమానికి సిఎం చంద్రబాబు ప్రత్యేక దృష్టి సారించారని, అందుకోసమే అన్నదాత సుఖీభవ పథకాన్ని ప్రారంభించారని తెలిపారు. నియోజకవర్గంలోని కరప మండలంలో 8,156 మంది, రూరల్ మండలంలో 1,920 మంది రైతులు సుఖీభవ పథకం ద్వారా లబ్ధిపొందారని అన్నారు.

అన్న క్యాంటీన్ పరిశీలన

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక మున్సిపల్ సెంటర్లో నిర్వహిస్తున్న అన్న క్యాంటీన్‌ను శనివారం ఆర్‌డిఒ శ్రీరమణి, మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్‌రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆహార పదార్థాల నాణ్యత, అన్న క్యాంటీన్లో ఉన్న సౌకర్యాలు, పరిశుభ్రత పరిశీలించారు. ఈ సందర్భంగా క్యాంటీన్‌లో భోజనం చేస్తున్న వారిని ఆహార పదార్థాల నాణ్యతపై ఆర్‌డిఒ ఆరా తీశారు. పరిశుభ్రమైన వాతావరణం ఉండేలా చర్యలు తీసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు.

కార్టూ'నిజం'



విద్యుదాఘాతంతో 6 ఇళ్లు దగ్ధం

-రోడ్డున పడ్డ బాధిత కుటుంబాలు
-పలువురు ఆర్థిక సాయం

ప్రజాశక్తి - ప్రత్తిపాడు

మండలంలో చిన్న శంకర్లపూడి గ్రామంలో శుక్రవారం అర్ధరాత్రి జరిగిన అగ్ని ప్రమాదంలో దళితపేటకు చెందిన 6 కుటుంబాలు నిరాశ్రయులయ్యాయి. అందరూ నిద్రిస్తున్న సమయంలో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. తొలుత మానూరి మణిమ్మ గృహంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో మంటలు వ్యాపించాయి. ఒక ఇంటి నుంచి మరో ఇంటికి మంటలు వ్యాపించి పిరాతి అచ్చారావు, పిరాతి అప్పన్న, మానూరి రజియ, మరో ఇద్దరి గృహాలు పూర్తిగా దగ్ధం అయ్యాయి. స్థానికులు అగ్నిమాపక అధికారులకు సమాచారం ఇవ్వడంతో హుటాహుటీన సంఘటనా ప్రాంతానికి చేరుకుని ఇతర గృహాలకు వ్యాపించకుండా మంటలను అదుపు చేశారు. ఈ ప్రమాదంలో సుమారు రూ.8 లక్షల ఆస్తి నష్టం జరిగిందని అగ్నిమాపక శాఖ అధికారులు అంచనా వేశారు.



బాధితులకు సరుకులు, నగదును అందిస్తున్న ఎంఎల్‌ఎ సత్యప్రభ

బాధిత కుటుంబాలను ఆదుకుంటాం: ఎంఎల్‌ఎ

అగ్ని ప్రమాద బాధితులను ప్రభుత్వ పరంగా ఆదుకుంటామని ఎంఎల్‌ఎ వరుపుల సత్యప్రభ అన్నారు. ప్రమాద సమాచారాన్ని తెలుసుకున్న ఎంఎల్‌ఎ శనివారం బాధితులను పరామర్శించారు. బాధిత కుటుంబాలకు తక్షణసాయంగా నగదు, నిత్యవసర వస్తువులను ఆమె అందజేశారు. బాధితుల కుటుంబాలను అన్ని విధాల ఆదుకుంటామని హామీ ఇచ్చారు. ఈ పర్యటనలో తహశీల్దార్ సూర్యప్రభ, టిడిపి జిల్లా ఉపాధ్యక్షులు కొమ్ముల కన్నబాబు, నాయకులు యాళ్ల జగదీష్, మిరియాల శ్రీను పాల్గొన్నారు.

అగ్ని ప్రమాద బాధితులకు చేయూత

మంటల్లో కాలిపోతున్న తాటాకు ఇల్లు

అగ్ని ప్రమాదంలో సర్వస్వం కోల్పోయి రోడ్డున పడ్డ కుటుంబానికి ప్రకృతి పర్యావరణ పరిరక్షణ సంఘం అండగా నిలిచింది. ప్రముఖ వైద్యులు, సంఘం అధ్యక్షులు డాక్టర్ ఎస్.విజయబాబు రూ.10 వేలు, సంఘం ఉపాధ్యక్షుడు డాక్టర్ అనసూరి నాగేశ్వరరావు రూ.5 వేలను అందజేశారు. జీసస్ మినిస్ట్రీస్ సంస్థ ద్వారా బాధిత కుటుంబాలకు అండగా ఉంటామని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సంఘం కార్యదర్శి గోళ్ళ నాగేశ్వరరావు, రౌతు సహదేవుడు పాల్గొన్నారు

నేరాలు ఘోరాలు

గంజాయి తరలిస్తున్న వ్యక్తి అరెస్ట్

ప్రజాశక్తి - జగ్గంపేట

మండలంలోని కాట్రావులపల్లి వద్ద గంజాయిని తరలిస్తున్న వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. ఎస్ఐ రఘునాథరావు తెలిపిన వివరాల ప్రకారం...కాట్రావులపల్లి గ్రామానికి చెందిన కె.లోవ రాజు 4.38 కేజీల గంజాయిని ప్యాకెట్లుగా తయారు చేసి శనివారం పెద్దాపురం వైపు వెళ్తుండగా ఐఒసిఎల్ బంక్ సమీపంలో పట్టుకోవడం జరిగింద న్నారు. అతన్ని పెద్దాపురం కోర్టులో హాజరుపర్చగా 14వ తేదీ వరకు న్యాయమూర్తి రిమాండ్ విధించారని తెలిపారు.

చికిత్స పొందుతూ వృద్ధుని మృతి

ప్రజాశక్తి - కాజులూరు

ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వృద్ధుడు కాల సత్యనారాయణ (62) ఆరోగ్యం విషమించి శనివారం మృతి చెందాడు. గొల్లపాలెం పోలీసులు తెలిపిన ప్రకారం.. శుక్రవారం గొల్లపాలెంలో ద్విచక్ర వాహనాల ఢీకొన్న ప్రమాదంలో కాల సత్యనారాయణ తీవ్రంగా గాయపడ్డాడు. అతను కాకినాడ జిజిహెచ్‌లో చికిత్స పొందుతున్నాడు. శనివారం మధ్యాహ్నం చికిత్స పొందుతూ ఆరోగ్యం విషమించడంతో మృతి చెందాడు. ఈ మేరకు ఎస్ఐ మోహన్‌కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గొలుసు దొంగకు దేహశుద్ధి

ప్రజాశక్తి - తాళ్లరేవు

మహిళ మెడలో గొలుసు దొంగిలించి పారిపోయిన దొంగను మండలంలోని సుంకరపాలెం జంక్షన్‌లో స్థానికులు పట్టుకుని దేహశుద్ధి చేశారు. కె. గంగవరం మండలం బ్రహ్మపురి గ్రామంలో ఇంటి బయట నిలబడిన ఓ మహిళ మెడలో గొలుసు అపహరించి ముగ్గురు వ్యక్తులు పరారయ్యారు. వారిని వెంబడించి వచ్చిన స్థానిక యువకులు సుంకరపాలెం జంక్షన్‌లో ఒక దొంగను గుర్తించి పట్టుకున్నారు. స్థానికుల సాయంతో దొంగను పట్టుకుని యానం పోలీసులకు అప్పగించారు. యానాం పోలీసులు ఆ దొంగను కె. గంగవరం మండల పోలీసులకు అప్పగించారు.

తండ్రిపై హత్యాయత్నం కేసులో నిందితునికి రిమాండ్

ప్రజాశక్తి - అమలాపురం రూరల్

ఇన్సూరెన్స్ సొమ్ము కోసం తండ్రిపై హత్యాయత్నానికి పాల్పడిన కేసులో కుమారునికి కోర్టు శనివారం రిమాండ్ విధించింది. తన తండ్రి యాక్సిడెంట్‌లో చనిపోతే అతని పేరున బ్యాంకులో ఇతర ఎల్ఐసి ఇన్సూరెన్స్ సొమ్ములు సులువుగా పొందవచ్చని అతని కుమారుడు ఒక పథకం పన్నాడు వివరాలు ఇవి.. అమలాపురం మండలం సాకుర్రు గ్రామానికి చెందిన విప్పర్తి హర్షవర్ధన్ ఆర్థికంగా నష్టపోవడంతో అక్రమంగా, సులువుగా డబ్బులు సంపాదించాలన్న ఉద్దేశ్యంతో తన తండ్రిని యాక్సిడెంట్ చేసి కడతేర్చాలనుకున్నాడు. దానిలో భాగంగానే గత ఏప్రిల్‌లో తన తండ్రి వెంకట రమణ కామనగరువు బైపాస్‌లో ద్విచక్ర వాహనంపై వెళుతున్నాడు. ఈ నేపథ్యంలో అతని కుమారుడు హర్షవర్ధన్ ముందస్తు వ్యూహంలో భాగంగా అద్దెకు కారు తెచ్చుకున్నాడు. ద్విచక్రవాహనంపై వెళుతున్న తండ్రి వెంకటరమణను కుమారుడు హర్షవర్ధన్ ఆ వెనుకనే కారుతో గుద్ది దాన్ని యాక్సిడెంట్‌గా అమలాపురం తాలూకా పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశాడు. దీనిపై రూరల్ పోలీస్‌లు కేసు నమోదు చేశారు. ఈ ఘటనలో గాయపడిన తండ్రి వెంకట రమణ కిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ కోమాలోంచి బయటకు వచ్చాడు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సిఐ డి.ప్రశాంత్ కుమార్, ఎస్ఐ శేఖర్‌బాబు ఈ కేసును దర్యాప్తు చేశారు. తన తండ్రిని ఉద్దేశ్యపూర్వకంగానే చంపాలని యాక్సిడెంట్ చేసినట్లు పోలీసుల ప్రాథమిక దర్యాప్తులో తేలింది. ఈనెల 1న సాకుర్రు విఆర్ఒతో వచ్చి పోలీస్ స్టేషన్ వద్ద నిందితుడు విప్పర్తి హర్షవర్ధన్ లొంగిపోయాడు. శనివారం నిందితుడుని రిమాండ్ రిపోర్ట్‌తో పాటు అమలాపురం కోర్టుకు హాజరు పరిచారు. కోర్టు నిందితునికి 14 రోజులు రిమాండ్ విధించింది. ఈ కేసును దర్యాప్తు చేసిన రూరల్ సిఐ డి.ప్రశాంత్ కుమార్, ఎస్ఐ వై.శేఖర్ బాబు, సిబ్బంది డి.ఏడుకొండలు, సిహెచ్. ఏసుబాబు, ఎం.నాగరాజు, కె.ఫణీంద్ర కుమార్ లతో కూడిన టీం ను ఎస్పి బి.కృష్ణారావు అభినందించారు.

వివాహిత ఆచూకీ లభ్యం

ప్రజాశక్తి - సీతానగరం

వివాహిత అదృశ్యమైన సంఘటనలో పోలీసులు ఆమె ఆచూకీని కనుగొని బంధువులకు అప్పగించారు. శుక్రవారం సీతానగరం పోలీసులు దీనిపై కేసు నమోదు చేశారు. బొబ్బిల్లంక గ్రామానికి చెందిన సోడదాసి లత శుక్రవారం ఉదయం ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. ఈ విషయమై ఆమె భర్త సోడదాసి సీతారామరాజు సీతానగరం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు మేరకు సీతానగరం ఎస్ఐ రామ్ కుమార్ కేసు దర్యాప్తు చేపట్టారు. ఆమె భర్తకు భయపడి అదే గ్రామంలో తెలిసిన వారి ఇంట్లో ఆశ్రయం పొందుతూ ఉన్నట్టు గుర్తించారు. ఆమెను బంధువులకు అప్పగించారు.

పథకాల అమలులో విఫలం

ప్రజాశక్తి - కాజులూరు

పథకాల అమలులో ప్రభుత్వం విఫలమైందని రామచంద్రపురం నియోజకవర్గ వైసిపి ఇన్‌ఛార్జ్ పిల్లి సూర్యప్రకాష్ అన్నారు. శనివారం మండలంలోని ఆర్యవటం, గొల్లపాలెం గ్రామాల్లో బాబు ష్యూరిటీ మోసం గ్యారంటీ కార్యక్రమం జరిగింది. వైసిపి మండల అధ్యక్షులు పిల్లి కృష్ణమూర్తి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఏడాది పాలనలో హామీలను నెరవేర్చడంలో పూర్తిగా విఫలం అయిందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి మాతా భారతి, ఆర్యవటం సర్పంచ్ వనం సూర్యవతి, ఎంపిటిసి సభ్యురాలు రాయుడు ఈశ్వరి, పితాని సుబ్రహ్మణ్యం, సూర్యనారాయణ, పోతు శ్రీనివాస్, పంపన శ్రీనివాస్ పాల్గొన్నారు.

వల్లభునికి రూ.2.9 లక్షల ఆదాయం

ప్రజాశక్తి - పెద్దాపురం

మండలం తిరుపతి గ్రామంలోని శృంగార వల్లభ స్వామి ఆలయానికి శనివారం ఒకరోజు వివిధ రూపాల్లో రూ.2.9 లక్షల ఆదాయం వచ్చిందని ఆలయ కార్యనిర్వహణాధికారి వడ్డి శ్రీనివాసరావు తెలిపారు. వివిధ ప్రత్యేక దర్శనం టికెట్ల ద్వారా రూ.1,80,800, అన్నదాన విరాళాల ద్వారా రూ.78,281, కేశఖండన ద్వారా రూ.5,800, తులాభారం ద్వారా రూ.500, లడ్డు ప్రసాదం ద్వారా రూ.25,320 వెరసి రూ.2,90,701 ఆదాయం వచ్చిందన్నారు. యాత్రికులకు ఉదయం పులిహార, మధ్యాహ్నం అన్నదానం చేశారు. ఆలయ అర్చకులు పెద్దింటి పురుషోత్తమాచార్యులు పెద్దింటి నారాయణాచార్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆశ..నిరాశ...

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం ప్రతినిధి

ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులకు సైతం దూరం కావటంతో దరఖాస్తుదారులలో ఆందోళన వ్యక్తమవుతుంది. గత నెలలో విడుదుల చేసిన తల్లికి వందనం మొక్కుబడిగా అమలు చేసి ప్రభుత్వం చేతులు దులుపుకున్న విషయం విదితమే. తాజాగా ఈ వారాంతలో విడుదలైన అన్నదాత సుఖీభవ పథకంలో ఇదే దుస్థితి తలెత్తింది. జిల్లావ్యాప్తంగా ఖరీఫ్ సాగు పెట్టుబడి కోసం రైతులు ఎదురు చూశారు. ఎట్టకేలకు కొందరి ఖాతాల్లో జమయ్యాయి. అత్యధిక మందికి ఖాతాల్లో జమ కాకపోవటంతో బ్యాంకుల చుట్టూ ప్రదక్షిణలు చేయకతప్పలేదు. అయితే అర్హులందరికీ పథకం నగదు జమ చేస్తామంటూ అధికారులు చెప్పటంతో రైతులు ఆశగా ఎదురు చూస్తున్నారు. మరో 3 వారాల్లో ఉచిత బస్సు పథకం అమలు చేస్తామంటూ మరోవైపు కొన్ని బస్సులకే పరిమితం చేయడంతో మహిళల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. టిడిపి ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాల అమలులో నిబంధనల కొర్రీలు అర్హులను దూరం చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో ప్రజల్లో ప్రభుత్వంపై వ్యతిరేకత వ్యక్తమవుతోంది. మరోవైపు ధరల పెరుగుదల మూలిగే నక్కపై తాటికాయ చందంగా మారుతోంది. ప్రభుత్వం ఇప్పటికైనా పునరాలోచించి ధరల నియంత్రణకు చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

వార్డెన్లకు.. అప్పుల తిప్పలు

విద్యా సంవత్సరం ప్రారంభమైన 3 నెలలు గడుస్తున్నా జిల్లాలో సంక్షేమ హాస్టళ్ల బిల్లులు చెల్లింపులో నిర్లక్ష్యం వెంటాడుతోంది. జిల్లావ్యాప్తంగా సంక్షేమ హాస్టల్స్ వార్డెన్లు అప్పుల తిప్పలతో అవస్థలు పడుతున్నారు. గడిచిన నెల రోజులలో నిత్యావసర సరుకుల ధరలు ఘణనీయంగా పెరిగాయి. కందిపప్పు కిలో రూ.173కు చేరింది. వంటనూనెల ధరలు నింగిని తాకుతున్నాయి. 20 నుంచి 30 శాతానికి చేరటంతో పామాయిల్ కిలో రూ.100కు చేరింది. చింతపండు ధర రూ.140కి చేరింది, ఉప్పు ధర రూ.5 నుంచి 15కు పెరిగింది. వాటితోపాటు కాయగూరల ధరలు రెండు, మూడు రెట్లు పెరిగాయి. కోడిగుడ్ల ధరలు రూ.7కి చేరాయి. ప్రతి హాస్టల్‌కు సుమారు రూ.లక్ష బిల్లులు బకాయిలు ఉన్నట్లు తెలుస్తోంది. ఈ పరిస్థితులలో అప్పులు చేసి నిర్వహణ కొనసాగిస్తున్నట్లు వార్డెన్లు చెబుతున్నారు. ఉన్నతాధికారులు చొరవ చూపి త్వరితగతిన బిల్లులు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని వార్డెన్లు, విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

ఆకాశాన్నంటుతున్న కూరగాయల ధరలు

కూరగాయల ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. చిక్కుళ్లు కేజీ రూ.100 మార్కు దాటేసింది. మిర్చి కేజీ రూ.80కు చేరాయి. వంకాయలు, బీర, ఇతర ఏ రకమైనా కేజీ రూ.60 వెచ్చించాల్సిందే. ఉల్లి కోయకుండానే కన్నీళ్లు తెప్పిస్తోంది. నాణ్యత ఆధారంగా కేజీ రూ.30 నుంచి రూ.40 చొప్పున విక్రయాలు జరుగుతున్నాయి. టమోటా కేజీ రూ.40 నుంచి రూ.50 వరకు విక్రయాలు జరుగుతున్నాయి. శ్రావణమాసం కావటంతో ధరలు నింగినితాకుతున్నాయని వ్యాపారులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో కూరగాయలు బహిరంగ మార్కెట్లో కొనుగోలు చేయలేక రైతు బజార్లకు వెళ్లిన కొనుగోలుదారులకు నిరాశే మిగులుతోంది. కూరగాయల నాణ్యత లేకపోవడంతో రైతు బజార్ల లక్ష్యం నీరు కారుతోంది.

జిల్లాలోని రైతు బజార్ల నుంచి నాణ్యమైన కూరగాయలు వ్యాపారులకు, హోటళ్లకు తరలిపోతున్నాయనే విమర్శలు విన్పిస్తున్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు దృష్టి సారించి రైతు బజార్లలో నాణ్యమైన కూరగాయలు అందుబాటులో ఉంచేలా చర్యలు చేపట్టాలని కొనుగోలుదారులు కోరుతున్నారు.

స్మార్ట్ మీటర్లపై వినియోగదారులు గుర్రు

కేంద్ర ప్రభుత్వం ఆదేశాలతో రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న స్మార్ట్ మీటర్లపై సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది. వాణిజ్య సంస్థలకు ఇప్పటికే స్మార్ట్ మీటర్లు బిగించిన విషయం విదితమే. వినియోగదారులకు ఒక్కసారిగా బిల్లులు అదనంగా రావడం, బిల్లులు చెల్లింపులలో ఆలస్యమైతే ఎటువంటి సమాచారం లేకుండా సరఫరా నిలిపివేయటంతో వినియోగదారులు ఆందోళన బాట పడుతున్నారు. ఈ ఆందోళనలకు వామపక్ష పార్టీలు అండగా నిలవటంతో ఎట్టకేలకు విద్యుత్ శాఖ దిగొచ్చింది. ప్రజా వ్యతిరేకత నేపథ్యంలో విద్యుత్ శాఖ ఉన్నతాధికారులు స్పందించక తప్పలేదు. అదనపు బిల్లులపై తమకు ఫిర్యాదు చేయవచ్చని, వినియోగదారుల అనుమతి లేకుండా ఏ ఒక్కరికీ స్మార్ట్ మీటర్లు బిగించబోమంటూ పత్రికా ముఖంగా వెల్లడించారు. దీంతో వినియోగదారులకు కొంత ఊరట లభించింది.

పాఠశాలలో క్షుద్ర పూజల కలకలం

ప్రజాశక్తి - సామర్లకోట

స్థానిక మున్సిపల్ ఉన్నత పాఠశాలలో క్షుద్ర పూజల కలకలం రేపింది. స్థానిక యార్లగడ్డ అక్కిరాజు మున్సిపల్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం ఈ ఘటన చోటు చేసుకుంది. ఉదయం 8.30 గంటలకు విద్యార్థులు పాఠశాలకు రాగా ఆవరణలో గేటు ప్రక్కన క్షుద్ర పూజలకు సంబంధించిన ముగ్గు వేసి, దానిలో నిమ్మకాయలు పెట్టి ఉండటాన్ని విద్యార్థులు గమనించి ఉపాధ్యాయులకు చెప్పారు. దీంతో ఉపాధ్యాయులు ముగ్గుపై నీళ్లు చెల్లించి శుభ్రం చేయించారు. అయితే విద్యార్థుల్లో భయం వీడక పోవడంతో చాలామంది విద్యార్థులు ఇంటికి వెళ్లిపోయారు. ఈ దుశ్చర్యపై రాత్రి కాపలాదారుని ఉపాధ్యాయులు నిలదీశారు. తెల్లవారే వరకు ఇలాంటి ముగ్గులు లేవని, ఉదయం కాలకృత్యాలు తీర్చుకునేందుకు వెళ్లిన సమయంలో జరిగి ఉంటుందని ఆయన

పాఠశాలలో ముగ్గులు, నిమ్మకాయలతో పూజలు

వివరణ ఇచ్చారు. దీనిపై పాఠశాల ఎదురుగా ఉన్న ఒక దుకాణంలోని సిసి కెమెరాలు పరిశీలించగా ఇద్దరు యువకులు ముఖానికి గుడ్డలు కట్టుకుని పాఠశాల ప్రహరీ ఎక్కి దూకి లోనికి ప్రవేశించడం, తిరిగి బయటకు రావడం కనిపించింది. దీనిపై పాఠశాల ఉపాధ్యాయులు స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్ఐ రమేష్‌బాబు పాఠశాలకు వచ్చి పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడారు. మూఢ నమ్మకాలను నమ్మొద్దని అవగాహన కల్పించారు.

విద్యారంగ సమస్యలపై నిరంతర పోరాటం

ప్రజాశక్తి - గొల్లప్రోలు

విద్యారంగ సమస్యలపై ఎస్ఎఫ్ఐ నిరంతరం పోరాటం చేస్తుందని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు జి.శ్రీకాంత్ తెలిపారు. శనివారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎస్ఎఫ్ఐ మండల సమావేశాన్ని వర్షిని అధ్యక్షతన

ఎంపికైన నూతన కమిటీ సభ్యులు

జరిగింది. తొలుత ఎస్ఎఫ్ఐ జెండాను ఆవిష్కరించారు. భగత్ సింగ్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ మాట్లాడుతూ విద్యార్థులు భయాన్ని వదిలి ధైర్యంగా ప్రశ్నించడం అలవర్చుకోవాలని అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యారంగాన్ని నాశనం చేస్తున్నాయని విమర్శించారు. ఎన్ఇపి-2020ని తక్షణం రద్దు చేయాలని, ఎయిడెడ్ పాఠశాల కళాశాలలో పుస్తకాలు, మధ్యాహ్న భోజనం తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. కాలేజీ లెక్చలర్ వర్మ మాట్లాడారు. అనంతరం ఎస్ఎఫ్ఐ మండల నూతన కమిటీ ఎన్నికైంది. అధ్యక్షులుగా సుప్రియ, కార్యదర్శిగా వడ్డికాసులు, ఉపాధ్యక్షులుగా వర్షిని, బిందు, సింధు, జి.సంతోష్, సహాయ కార్యదర్శులుగా స్వామి, మనోజ్‌కుమార్, హరి, కెవి.వినయ్, డి.మల్లిక ఎన్నికయ్యారు.

వితంతువులకు పింఛన్ల పంపిణీ

ప్రజాశక్తి - యంత్రాంగం

కిర్లంపూడి స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి తోట రవి అధ్యక్షతన వితంతువులకు పింఛన్ల పంపిణీ కార్యక్రమం శనివారం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎంఎల్ఎ జ్యోతుల నెహ్రూ పాల్గొని పింఛన్లు పంపిణీ చేశారు. ఈ క్యాక్రమంలో ఎంపిడిఒ బి.హరికృష్ణ, ఏలేరు ప్రాజెక్ట్ ఛైర్మన్ బస్వా వీరబాబు, మార్కెట్ కమిటీ ఛైర్మన్ అడపా భరత్‌బాబు, కిర్లంపూడి, వీరవరం సొసైటీల ఛైర్మన్లు తోట గాంధీ, కుర్ల చినబాబు, సర్పంచులు గుడాల శ్రీలత, వీరంరెడ్డి కాశీబాబు, జ్యోతుల రాంబాబు, ఎంపిటిసి సమాఖ్య మండల అధ్యక్షుడు అల్లు శివరామకృష్ణ, కూటమి నాయకులు పాల్గొన్నారు. **గండేపల్లి** స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి చలగళ్ల దొరబాబు అధ్యక్షతన వితంతువులకు పింఛన్ల పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎంఎల్ఎ జ్యోతుల నెహ్రూ పాల్గొని వితంతువులకు పింఛన్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒకర్రి చంద్రరావు, ఈ కార్యక్రమంలో కోర్పు లచ్చయ్యదొర, పోతుల మోహనరావు, అడపా భరత్, అడబాల భాస్కరరావు, పరిమి బాబు, కందుల చిట్టిబాబు, సొసైటీ ఛైర్మన్లు కంటిపూడి

కాజులూరులో పింఛన్‌ను అందిస్తున్న దాట్ల

సత్తిబాబు, పాలకుర్తి ఆదినారాయణ, కందుల కొండయ్య చౌదరి, దిడ్డి వెంకటరాజు, సర్పంచులు పాల్గొన్నారు. **కాజులూరు** మండలంలోని కోలంక గ్రామంలో పింఛన్ల పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా కోటిపల్లి డిసి దాట్ల విజయగోపాలరాజు పాల్గొని మాట్లాడారు. మండలంలో కొత్తగా 198కి పింఛన్లు మంజూరు అయ్యాయని, కోలంక గ్రామంలో 15 మందికి పింఛన్లు మంజూరు అయ్యాయని తెలిపారు. సాంకేతిక కారణాలతో ఏడుగురుకి ఆగాయని, వాటిని త్వరలోనే మంజూరు అయ్యేలా చర్యలు తీసుకుంటామని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు దంతులూరి నరసింహరాజు, దంతులూరి వంశీ, వెంకన్నబాబు, జాన ప్రసాద్, వెల్ఫేర్ అసిస్టెంట్ తలాటం సుభాదేవి పాల్గొన్నారు.

కూటమి పాలనలో రైతుల సంక్షేమానికి పెద్దపీట

ప్రజాశక్తి - కాకినాడ రూరల్

రైతుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని రంపచోడవరం నియోజకవర్గ టిడిపి పరిశీలకులు కొల్లుబోయిన శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. శనివారం రంపచోడవరం మండలం పందిరిమామిడి కృషి విజ్ఞాన కేంద్రంలో అన్నదాత సుఖీభవ పథకం ప్రారంభ కార్యక్రమం ఎంఎల్ఎ మిరియాల శిరీషాదేవి అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఏజెన్సీ ప్రాంతం అయినప్పటికీ మెట్ట వ్యవసాయంపై ఆధారపడే రైతులకు కూటమి ప్రభుత్వం పెద్దపీట వేసిందని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతి రైతు ఖాతాలో రూ.7వేలు నేరుగా జమ చేస్తున్నట్టు తెలిపారు. ఎంఎల్ఎ శిరీషాదేవి మాట్లాడుతూ రంపచోడవరం

డ్రోన్ పరికరాన్ని పరిశీలిస్తున్న ఎంఎల్ఎ శిరీషాదేవి

డివిజన్ వ్యాప్తంగా 40,057 మంది రైతులకు రూ.2803.99 కోట్లను రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంఎల్ఎ చిన్నం బాబూరమేష్, ఐటిడిఎ పిఒ కట్టా సింహాచలం, కెవికె శాస్త్రవేత్తలు ఆర్.ప్రవీణ్‌బాబు, కె.రాజేంద్రప్రసాద్, ఎంపిపి శ్రీదేవి, జడ్‌పిటిసి పండా వెంకటలక్ష్మి, మాజీ సర్పంచ్ నిరంజనీదేవి పాల్గొన్నారు.

పలుచోట్ల తల్లి పాల వారోత్సవాలు

ప్రజాశక్తి - యంత్రాంగం

జగ్గంపేట మండలంలోని రాజపూడి, మల్లిశాల గ్రామాల్లో శనివారం తల్లి పాలు వారోత్సవాలను నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో సిడిపిఒ ఎం.పూర్ణిమ, రాజపూడి వైద్యురాలు ఎన్.పూజ పాల్గొని గర్భిణులకు, బాలింతలకు తల్లిపాలు యొక్క ప్రాముఖ్య తను వివరించారు. ఈ కార్యక్రమంలో అంగన్ వాడీ సూపర్‌వైజర్లు అమ్మాజీ, ఎంఎల్‌హెచ్‌పి, మహిళా పోలీసులు, ఎఎన్ఎంలు, ఆశ, అంగన్ వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు. **సామర్లకోట** తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా స్థానిక బస్, రైల్వే స్టేషన్‌లలో బిడ్డలకు తల్లి పాలిచ్చే గదులపై ప్రయాణీకులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సెక్టార్ సూపర్‌వైజర్లు ఎన్.ఉమాదేవి, ఎం.సుల్తానా బీబీ, స్టేషన్ మేనేజర్ ఎం.రమేష్, చైల్డ్ హెల్ప్ లైన్ ప్రాజెక్ట్ 1098 జిల్లా ప్రాజెక్ట్ కో ఆర్డినేటర్ బి.శ్రీనివాస రావు, కేసు వర్కర్ లక్ష్మి, క్రాఫ్ స్వచ్ఛంద సంస్థ కో ఆర్డినేటర్ కుమారి, లక్ష్మి, ఎఎన్ఎంలు, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు. **యు.కొత్తపల్లి** స్థానిక మూలపేట సెక్టర్లో శనివారం తల్లిపాలు వారోత్స వాలను ఘనంగా నిర్వహించారు. ఇఒ లలిత అధ్య క్షతన మూలపేట 139 సెంటర్లో హెల్త్ సూపర్‌వైజర్ ఎంఎస్‌కె.కృష్ణవేణి, ఉపాధ్యాయులు, బాలింత తల్లులు, పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు. **తాళ్లరేవు** స్థానిక జార్జిపేట పంచాయతీ ఎంఎల్‌కె నగర్ అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవం జరిగింది. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్‌వైజర్ సిహెచ్. నాగలక్ష్మి పాల్గొని గర్భిణులు, బాలింతలకు తల్లి పాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు. **పిఠాపురం** సిడిపిఒ సి.హెచ్.దుర్గాదేవి ఆధ్వర్యంలో భీమ్ నగర్ విరవాడ సెక్టార్, చిత్రాడ గ్రామంలో తల్లిపాల వారోత్సవాలు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తల్లిపాల ప్రాముఖ్యతను గురించి గర్భిణీ బాలింతరాలకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్‌వైజర్లు సుజాత, ప్రభావతి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

వారి స్నేహానికి 30 ఏళ్లు...

ప్రజాశక్తి - ప్రత్తిపాడు

స్నేహం అనేది రెండక్షరాలా పదమే కాదు. అన్ని అనుబంధాలకన్నా బలియమైన బంధం. కష్ట సుఖాల్ని కలిమి లేమిల్ని సమదృష్టితో చూసే తత్త్వం స్నేహానిది. అలాంటి స్నేహానికి ప్రతీకలుగా నిలిచారు ప్రత్తిపాడుకు చెందిన సలాది కృష్ణ, నాగర్‌కర్నూల్‌కు చెందిన సంబు ప్రభాకరం. కలం స్నేహం ద్వారా చిగురించిన వీరి స్నేహం మూడు దశాబ్దాలుగా కొనసాగుతూనే ఉంది. ప్రత్తిపాడుకు చెందిన ఈశ్వర్ స్టూడియో అధినేత సలాది కష్ణ, నాగర్ కర్నూల్ చెందిన సంబు ప్రభాకర్ మూడు దశాబ్దాలు క్రితం ఒక వారపత్రికలో కలంస్నేహం అనే శీర్షిక ద్వారా మిత్రులయ్యారు అప్పట్నుంచి వీరి మధ్య బలీయమైన బంధం పెనవేసుకుంది. వారి మధ్యే కాదు వారి కుటుంబాలు కూడా ఒక్కటిగా కలిసిపోయాడు. ప్రస్తుతం ప్రభాకర్ హైదరాబాద్‌లో వ్యాపారిగా స్థిరపడ్డారు. ప్రభాకర్ పుణ్యక్షేత్రల సందర్శన సందర్భంగా ప్రత్తిపాడులో కృష్ణ ఇంటికి వచ్చారు. అప్పటి నుంచి వీరి ఇళ్లలో ఏ శుభకార్యాలు జరిగినా రెండు కుటుంబాలు సరదాగా గడుపుతున్నాయి.

పోలీసుల ఆకస్మిక తనిఖీలు

ప్రజాశక్తి - సామర్లకోట

పట్టణంలో పలు ప్రాంతాల్లో పోలీసులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. సిఐ ఎ.కృష్ణ భగవాన్, ఎస్ఐలు డి.రమేష్‌బాబు, పివిఆర్.మూర్తి, ఎ.గరగరావు సిబ్బంది, జిల్లా క్విక్ రెస్పాన్స్ టీమ్ సంయుక్తంగా శనివారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. భీమేశ్వరస్వామి ఆలయం పరిసరాలు, పాత సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం, అమ్మానమ్మ అపార్ట్‌మెంట్లు తదితర ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించారు. వీటిలో బయట ప్రాంతాల నుంచి వచ్చి ఖాళీ ప్రదేశాల్లో గుడారాలు వేసి నివసిస్తున్నవారిని గుర్తించి, వారి వస్తువులు, మోటార్ సైకిళ్లు తదితర సామగ్రి పరిశీలించారు. వారి ఐడెంటిటీ కార్డులను పరిశీలించి, స్వగ్రామాలకు వెళ్లాలని కౌన్సిలింగ్ ఇచ్చారు.

భౌతిక శాస్త్ర ప్రయోగాలపై అవగాహన

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక ఎసిటి సైన్స్ సెంటర్లో శనివారం పెద్దాపురం-సామర్లకోట రహదారిలోని విక్టర్ గర్ల్స్ హైస్కూల్ విద్యార్థులకు భౌతిక శాస్త్ర ప్రయోగాలపై అవగాహన కల్పించారు. సైన్స్ సెంటర్ నిర్వాహకులు బుద్ధా శ్రీనివాస్ ఆధ్వర్యంలో రసాయన సమీకరణాలు, చర్యలు పాఠ్యాంశంపై అవగాహన కల్పించి వారితో ప్రయోగాలు చేయించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం రత్నకుమారి, విద్యార్థులు పాల్గొన్నారు.

ఫౌండేషన్‌కు రూ.30 వేల విరాళం

ప్రజాశక్తి - జగ్గంపేట

జ్యోతుల నెహ్రు ఫౌండేషన్‌కు రిటైర్డ్ డిప్యూటీ ఎంపిడిఒ సూర్య భాస్కరరావు రూ.30 వేలు విరాళాన్ని అందించారు. శనివారం స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయం వద్ద ఎంఎల్ఎ జ్యోతుల నెహ్రూకు ఆయన చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా సూర్యభాస్కర్‌రావు మాట్లాడుతూ ఫౌండేషన్ ద్వారా అనేక సేవా కార్యక్రమాలు చేస్తున్న ఈ సంస్థకు ఈ చిరు విరాళం అందించానని తెలిపారు. అనంతరం ఆయనను ఎంఎల్ఎ ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు ఎస్‌విఎస్. అప్పలరాజు, మారిశెట్టి భద్రం, కొత్త కొండబాబు, బుర్రి సత్తిబాబు, దేవరపల్లి మూర్తి, వేములకొండ జోగారావు, నకిరేడ్డి సూర్యవతి, ఎంపిడిఒ చంద్రశేఖర్, పంచాయతీ కార్యదర్శి జివివిఎస్‌కె.ప్రసాద్ పాల్గొన్నారు.

మాజీ కౌన్సిలర్ కుటుంబానికి పరామర్శ

ప్రజాశక్తి - పెద్దాపురం

మున్సిపల్ మాజీ కౌన్సిలర్ పప్పల రామకృష్ణ కుటుంబ సభ్యులను శనివారం వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ దవులూరి దొరబాబు, వైసిపి నాయకులు పరామర్శించారు. ఇటీవల పప్పల రామకృష్ణ మృతి చెందారు. ఈ నేపథ్యంలో ఆయన కుమారుడు, నియోజకవర్గ వైసిపి బిసి విభాగం అధ్యక్షుడు పప్పల బుజ్జి, ఇతర కుటుంబ సభ్యులను దొరబాబు పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ ఛైర్మన్ నెక్కంటి సాయిప్రసాద్, తాడి రాజశేఖర్, దాకమూరి రమేష్, బి.రాంబాబు, మున్సిపల్ కౌన్సిలర్ ఆరెళ్ల వీరరాఘవ, కోఆప్షన్ సభ్యుడు వాసంశెట్టి గంగ, తదితరులు పాల్గొన్నారు.

యానాం వార్తలు

రైతు సమస్యలను పరిష్కరించాలి

ప్రజాశక్తి - యానాం

స్థానిక ప్రాంతీయ పరిపాలనాధికారి కార్యాలయంలో సొసైటీ సభ్యులు, రైతు నాయకులు ఆర్ఎఒ మునిస్వామి అధ్యక్షతన రైతుల సమస్యలపై శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్ఎఒ మునిస్వామికి రైతులు సమస్యలను వివరించారు. వ్యవసాయ శాఖ జనరల్ రైతులకు, ఎస్‌సి రైతులకు రాయితీలో ట్రాక్టర్లు ఇవ్వాల్సి ఉండగా రైతులు వాటా సొమ్ము చెల్లించినప్పటికీ సంబంధిత కంపెనీ ట్రాక్టర్లు డెలివరీ చేయకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. తక్షణమే పుదుచ్చేరి అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తానని ఆర్ఎఒ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సొసైటీ చీఫ్ ప్రమోటర్, ప్రెసిడెంట్ మాజేటి సత్యభాస్కర్, రైతు నాయకులు ఈలప్రోలు విష్ణువర్ధనరావు, మల్లాడి శామ్యూల్, కోన వెంకట్రావు, కొండమూరి భాస్కరరావు, మట్ట సురేష్, మెల్లం చిన్న, దాసరి మంగాదేవి, జోగిరాజు పాల్గొన్నారు.

తల్లిపాల ప్రాధాన్యతపై అవగాహనా సదస్సు

ప్రజాశక్తి - యానాం

ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో స్థానిక అంబేద్కర్ నగర్ దున్నా నాగారావు ప్రైమరీ స్కూల్ అంగన్వాడి సెంటర్లో తల్లిపాల ప్రాధాన్యతపై శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయుర్వేదం డాక్టర్ లక్ష్మీ మాట్లాడుతూ తల్లిపాలు పిల్లలకు ఇవ్వడం ఎంతో శ్రేష్టమని అన్నారు. పురుడు వచ్చిన వెంటనే తల్లి పాలు ఇవ్వడం వల్ల బిడ్డకు రోగాలు సోకకుండా కాపాడతాయన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం విజయలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

పింగళి వెంకయ్యకు ఘన నివాళి

ప్రజాశక్తి - యానాం

జాతీయ పతాక రూపకర్త పింగళి వెంకయ్య జయంతిని సమాచార శాఖ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ఫెర్రీ రోడ్‌లో ఉన్న ఆయన విగ్రహానికి మున్సిపల్ కమిషనర్ బుద్ది అఖిల్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సిఐ అడలరసన్, ట్రాఫిక్ ఎస్ఐ శేరు నూకరాజు, హంసాని రామలక్ష్మణుడు, కొల్లు ప్రసాద్, రాజు పాల్గొన్నారు.

ఉప్పంగల ఉపాధి పనుల్లో లోపాలు

ప్రజాశక్తి - తాళ్లరేవు

మండలంలోని ఉప్పంగల గ్రామంలో జరిగిన ఉపాధి హామీ పథకం పనులలో పలు లోపాలు గుర్తించినట్లు సామాజిక తనిఖీ బృందం వెల్లడించింది. స్థానిక గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద శనివారం గ్రామ సర్పంచ్ శాఖా శంకరుడు మాట్లాడారు. ఉప్పంగలలో ఫీల్డ్ అసిస్టెంట్ లేకపోవడం వల్ల కూలీలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వెంటనే ఫీల్డ్ అసిస్టెంట్ నియామకం జరపాలని స్థానికులు కోరారు. తనిఖీ బృందం ప్రతినిధి శ్రీనివాస్ మాట్లాడుతూ గ్రామంలో కాలువల మట్టి తీత పనులు రూ.10 లక్షలతో చేశారని, అయితే తనిఖీలలో పనులు గుర్తించలేకపోయామన్నారు. ఒక కాలువ మట్టి పనిలో 250 మీటర్ల పొడవు తేడా వచ్చిందని తెలిపారు. రెండు గృహ నిర్మాణాలు పునాది పూర్తి కాకుండానే ఒకరికి 39, మరోకరికి 32 పని దినాలకు అదనంగా వేతనాలు ఇచ్చారన్నారు. ఈ సమావేశంలో సామాజిక తనిఖీ బృందం ప్రతినిధులు, ఇతర అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

మహారాజశ్రీ సివిల్ జడ్జి(జూనియర్ డివిజన్) ముమ్మిడివరం వారి కోర్టులో
OS.No.20/2018

Between:-
Golakoti Vishnu Murthy and others ...వాదులు
And
Golakoti Adinarayana and others ...ప్రతివాదులు
To
D9. Sunkara Veeranna S/o.Late Nageswara Rao, Pappulavaripalem, Narendrapuram Village, Kothapeta Mandal, KPT.Jr..C.J.
D10. Peddireddy Surya Kumari W/o. Ramababu(Venkata Swamy), Ainavilli Village, Ainavill Mandal, Amp.Prl.Jr.C.J.

ఈ పై నెంబర్ దావాను వాదులు మీ పై దావా ఆస్తిలో వాటా కోరుచూ, స్వాధీనం చెయ్యమని మున్నగు పరిహారములు కోరుచూ వాదులు పై కోర్టులో దావాను దాఖలు చేసియున్నారు. సదరు దావాలో మీకు సమన్లు నిమిత్తం మరియు మీ హాజరు నిమిత్తం వాయిదా **06-08-2025వ** తేదీ అయి ఉన్నది. కావున మీరు వాయిదా రోజున ఉదయం **గం॥10.30 ని॥లకు** పై కోర్టు వారి ఎదుట స్వయంగా గాని, అడ్వకేట్ వారి ద్వారా గాని హాజరై మీ ఆక్షేపణలు తెలుపుకోవలెనన్నీ, అట్లు కాని యెడల మీ పరోక్షమందున తీర్మాణింపబడునన్నీ ఇందుమూలముగా తెలియ జేయడమైనది.

(శ్రీ కోర్టు వారి అనుమతితో)
శ్రీ కుచ్చర్లపాటి తాతంరాజు
శ్రీ గుత్తుల శ్రీనివాసరావు
Miss.మట్ట రమ్య
ముమ్మిడివరం అడ్వకేట్స్,ముమ్మిడివరం
ది.2-08-2025 9440041751,9440528135

మహారాజశ్రీ 8వ అదనపు జిల్లా జడ్జి వారి కోర్టు రాజమహేంద్రవరం
(మైనరు దొంతంశెట్టి రాఘవ ప్రకాష్ వయస్సు15 కొరకు)
G.W.O.P.71/2025

Between:-
దొంతంశెట్టి మురళీ మోహన్ వెంకటేశ్వర రావు S/o.దొంతంశెట్టి సాంబ సదా శివరావు, హిందు, వయస్సు 52, R/o.ప్లాట్‌నెం.12,2వ ఫ్లోర్, 4th cross భువనేశ్వరి నగర్ జనభారతి 2వ Stage, బెంగుళూర్, కర్నాటక రాష్ట్రం. ...పిటీషనర్
And
Nill ...రెస్పాండెంట్స్

పై నెంబరు గార్డియన్ గ్రంధంలో చనిపోయిన శ్రీమతి ఆకాశం సుభాషిణి @ దొంతంశెట్టి సుభాషిణి గారి కుమారుడు అయిన దొంతంశెట్టి రాఘవ ప్రకాష్ మైనరు అయినందున పిటీషనర్ అయిన దొంతంశెట్టి మురళీ మోహన్ వెంకటేశ్వరరావు గారిని గార్డియన్‌గా నియమించమని మరియు మైనరు యొక్క అభివృద్ధి, చదువు, కొరకు ఈ క్రింది షెడ్యూలు ఆస్తిని విక్రయించుటకు అనుమతులు కోరుచూ దాఖలు చేసిన G.W.O.P. లో ఎవరికైన ఎటువంటి అభ్యంతరములు ఉన్నయెడల **ది.12-08-2025** ఉదయం **10.30ని॥లకు** పై కోర్టువారి ఎదుట హాజరై మీ యొక్క అభ్యంతరములు తెలుపవలసిందిగా యావన్మందికి తెలియజేయడమైనది.

మైనరు యొక్క ఆస్తి వివరములు
A Schedule for site
East Godavari district, Kadiyam Sub-registry Limits, Hukumpeta village and panchayat an extent of 637.33 sq yards in Old RS No 1099/1,2 (total extent of Ac 11-22 cents after sub-division in present R S No 1099/1B (Ac 0.33 cents in middle part of total extent of Ac 2-00 cents) situated in Hukumpeta, villag and panchayat, Rajamahendravaram Rural Mandal and bounded by: **East:** Property of Muppana Rajkumar96-00 ft **South:** 40-0 ft Road59-9 ft **West:** Property of Nakka Surya Chandra96-0 ft **North:** Property of Boppanan Ratnaji59-9ft Within the above boundaries an extent of 637.33 sq yards or 532.97 sq mts site in that undivided and unspecified 1/22nd share which comes to 28.97 sq yards or which comes to 24.22 sq meters with co-owners, common and joint rights including the rights of easement etc.,

B schedule Flat
Within the above A Schedule Site the apartment constructed under the name and style of Sai Ganesh Plaza, in the third floor plinth Area 1250 sq ft (including common area, balconies and car parking) which was constructed in the above schedule A Site and bounded by: **East:** Open to sky **South:** Open to Sky **West:** Common Corridor **North:** Open to sky Within the above boundaries and extent of 1250 sft with all electrical fittings electrical service connections and all other easement rights,

యిన్నమూరి బాల సుబ్రహ్మణ్యం
రాజమండ్రి అడ్వకేట్,రాజమండ్రి
2-08-25 సెల్.9700845909

పబ్లిక్ నోటీసు

మా క్లైంట్ శ్రీ తెమ్మనబోయిన గంగబాబు(S/o నాగభూషణం) సంపర,పెదపూడి మండలం కాకినాడ జిల్లా వారి సంజాయిషి పై యావన్మందికి తెలియ జేయునది ఏమనగా, ఈ దిగువ షెడ్యూల్ ఆస్తి శ్రీమతి కర్రి పద్మావతి (W/o సత్తిరెడ్డి) కొమరిపాలెం, బిక్కవోలు మండలం, తూర్పు గోదావరి జిల్లా వారు **ది.09-07-1987** తేదీన రిజిస్టరీ క్రియ దాస్తావేజు ద్వారా శ్రీమతి కడిమి సత్యానందం గారి వల్ల స్వాధీనం పొంది నాటి నుండి నేటి వరకు స్వాధీన హక్కు భుక్తములలో ఉన్న సదరు ఆస్తి నా క్లైంట్ క్రియం పొందుటకు ఏర్పాటు చేసుకుని ఉన్నారు. సదరు ఒరిజినల్ దస్తావేజులు పోయినందున ఈ ప్రకటన ద్వారా యావన్మందికి తెలియజేయునది ఏమనగా సదరు షెడ్యూల్ ఆస్తి పై ఎవరికైనా ఎట్టి హక్కులుగాని, తనఖాలు గాని, చార్జీలు గాని, ఆక్షేపణలు కానీ ఉన్న ఎడల ఈ ప్రకటన విడుదల తేదీ లగాయితు వారం రోజులు లోగా ఈ క్రింది అడ్రస్ వారికి వ్రాతపూర్వకంగా తెలియ పరచుకొనవచ్చును. గడువు తేదీలోగా ఎట్టి అభ్యంతరములు రాని యెడల షెడ్యూల్ ఆస్తిని నిర్వివాద, నిష్చేలేని ఆస్తిగా ఎంచి మా క్లైంట్ షెడ్యూల్ ఆస్తిని రిజిస్టర్ క్రయ దస్తావేజు ద్వారా స్వాధీనం పొందగలరు. తదుపరి వచ్చిన క్లైంట్లు గాని ఆక్షేపణలు గాని చెల్లనేరవు మాక్లైంట్‌ను బైండ్ చేయవు.

ఆస్తి షెడ్యూలు
కాకినాడ జిల్లా (గతంలో తూర్పుగోదావరిజిల్లా), కాకినాడ సబ్ రిజిస్టర్ పరిధిలోని పెదపూడి మండలం సంపర గ్రామం తాలూకు జిరాయితీ పల్లం రి.సరే.నెం.407/2 లోని పూరా య.0.84 సెంట్లు లేదా 0.34 హెక్టార్లు భూమికి హద్దులు
హద్దులు
తూర్పు:- నాగిరెడ్డి లచ్చారావు వగైరాలు జిరాయితీ భూమి, **ఉత్తరం:-** మట్ట సూర్యనారాయణ వగైరాలు జిరాయితీ భూమి **దక్షిణం:-** నాగిరెడ్డి వెంకన్న గారి కుమారుడు వీరాస్వామి వగైరాల జిరాయితీ భూమి, **పడమర:-** మట్ట సరోజినీ వగైరాల జిరాయితీ భూమి, సదరు హద్దులు మధ్యస్థమైన య.0.84 సెంట్లు పల్లపు భూమి అందు యావత్తు ఈజిమెంట్ హక్కులతో సహా

ఉండ్రు విజయలక్ష్మి
అడ్వకేట్&నోటరీ
కాకినాడ తూరంగి,కాకినాడ
తేది.02-08-2025 సెల్.9441437075